ఆధ్యాత్మిక చింతన విశ్వమానవాళికి శ్రేయస్సు



చిక్కడపల్లి: భారతీయ ఆధ్యాత్మిక చింతన విశ్వమానవాళి శ్రేయస్సుకు ఉపయోగపడుతుందని సంస్కృత అకాడమీ డైరెక్టర్ పెన్న మధుసూదన్ అన్నారు. ఉగాదిని పురస్కరించుకొని మంగళవారం రాత్రి నోరి నరసింహశాస్త్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో జరిగిన అపూర్వ గ్రంథాల ఆవిష్కరణలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శృంగేరి విరూపాక్ష పీఠాధిపతి జగద్గురు గంభీరానంద భారతీ మహాస్వామి , ట్రస్టు అధ్యక్షుడు నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రముఖులు వెంకటరాయశర్మ, వారణాసి వెంకటేశ్వర్లు, నోరి శివసేనానిలు పాల్గొన్నారు.

స్మోకింగ్ ఎఫెక్ట్స్‌పై సినిమా తీయండి

'మాచన' విజ్ఞప్తికి స్పందించిన దర్శకుడు హరీష్‌శంకర్



మాచన రఘునందన్

కాచిగూడ: పొగాకు, ధూమపానం అలవాట్ల వల్ల విద్యార్థులు, యువత నిర్వీర్యం అవుతోందని సినిమా మాధ్యమం ద్వారా వారిని చైతన్య పరిచేలా ఓ సినిమా తీయాల్సిందిగా.. పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత, డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ చేసిన ప్రార్థనకు సినీ దర్శకుడు హరీష్‌శంకర్ స్పందించారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా హరీష్‌శంకర్‌కు మాచన రఘునందన్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదే సందర్భంగా పొగాకు, ధూమపానం చేసే నష్టాలపై సినిమా తీస్తే యువత జాగృతం అయ్యే అవకాశం ఉందని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన దర్శకుడు హరీష్‌శంకర్ 'తప్పకుండా నా వంతు ప్రయత్నం చేస్తా' అని స్పందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్

హిమాయత్‌నగర్: స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మి ఆదేశాల మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి.రామన్‌గౌడ్ డివిజన్‌లోని రాజ్‌మొహల్లాలో పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాము, నరేందర్, జానకిరామ్, నర్సింగ్‌రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

5న నోటరీ అడ్వకేట్ల రాష్ట్రస్థాయి సమావేశం

బర్కత్‌పుర/లాల్‌పేట్: తెలంగాణలోని నోటరీ అడ్వకేట్ల సమస్యలపై చర్చించేందుకు ఈనెల 5న రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ అడ్వకేట్ నోటరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంజి యాదగిరి, కార్యదర్శి మయబ్రహ్మ నరసింహ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఎదుట భోలక్‌పూర్‌లోని ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి నోటరీ అడ్వకేట్లు పెద్ద ఎత్తున సమావేశానికి హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు.

అధ్యాపకుల ప్రమోషన్లకు ఇంటర్వ్యూలు నిర్వహించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అధ్యాపకుల ప్రమోషన్లకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని పలువురు ప్రొఫెసర్లు వీసీ ప్రొ.కుమార్‌ను మంగళవారం కలిసి విజ్ఞప్తి చ చేశారు. సీఏఎస్ కింద (కేరీర్ అడ్వాన్స్ స్కీమ్) ప్రతి 6 నెలలకు ఒకసారి నిర్వహించే ఉద్యోగోన్నతలకు గతేడాది నుంచి ఇంటర్వ్యూలు చేపట్టడం లేదన్నారు. వెంటనే స్పందించి ఇంటర్వ్యూలు జరపలని కోరారు.

ఔటా ఎన్నికలు నిర్వహించాలి

ఔటా ఎన్నికలు (ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్) నిర్వహించాలని పలువురు ప్రొఫెసర్లు అధికారులను కోరారు. గత ఔటా కార్యవర్గ కాలపరిమితి ముగిసి 3 నెలలు గడిచినా ఇప్పటివరకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రతి రెండేళ్లకు ఒక్కసారి ఓయూ అధికారికంగా నిర్వహించే ఔటా ఎన్నికల్లో తీవ్ర జాప్యం వల్ల అధ్యాపకుల సమస్యలపై మాట్లాడేవారే లేరని సీనియర్ అధ్యాపకులు వాపోతున్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ. 15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికం 40, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 8, క్యారెట్ 19, దొండ 35, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 13, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 23.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 10 వరకు బ్రహ్మోత్సవాలు
- తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు
- 6న 'శ్రీ సీతారాముల కల్యాణం'

ముస్తాబైన న్యూ నల్లకుంట రామాలయం





న్యూ నల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి దేవాలయం

నల్లకుంట: శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని ఈనెల 2వ తేదీ (నేడు) నుంచి 10వ తేదీ వరకు సీతారామచంద్రస్వాముల వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు న్యూ నల్లకుంటలోని రామాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయానికి రంగులు వేసి భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేయించారు. విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. అలాగే భక్తుల కోసం తాగు నీటి వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు నిత్యం ఉపనిషత్ పూర్వక అభిషేకాలు, సుందరకాండ పారాయణం, పుష్పార్చనలు, తులసీ దళార్చనలు, అష్టోత్తర శతనామార్చన ఉంటాయి. మంగళవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.జయంతి బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడించారు.

బ్రహ్మోత్సవాల పూజా వివరాలు..

బుధవారం ఉదయం శ్రీరామ సుప్రభాత సేవ ఉంటుందని అనంతరం స్వామి అమ్మవార్లకు అభిషేకం, అర్చనలు ఉంటాయని తెలిపారు. 5వ తేదీన సీతారామచంద్రస్వామి జన్మనక్షత్రం, పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని 108 కలశాల ఆవుపాలతో అభిషేకం ఉంటుందన్నారు. 6వ తేదీన సీతారాచంద్రస్వామి కల్యాణ మహోత్సవం ఉంటుదని తెలిపారు. 7వ తేదీ సాయంత్రం 7గంటలకు ప్రముఖ సంగీత విద్వాంసుడు, పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాస శర్మ, యశస్విలచే భక్తి సంగీత కచేరి ఉంటుందని చెప్పారు. అనంతరం శ్రీనివాస శర్మచే వీణా వాద్య కచేరి ఉంటుందని తెలిపారు. 8వ తేదీన విశేష పుష్పార్చన ఉంటుందని తెలిపారు. 10వ తేదీన ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమం, అలాగే బలిహరణం, అలాగే సమయానుకూలంగా రథోత్సవం ఉంటుందని రపేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోలీసు బందోబస్తు సైతం చేశామని తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో వేసిన చలువ పందిళ్లు

హెచ్‌సీయూ భూముల స్వాధీనం ఆపాలి

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్

ముషీరాబాద్: అనేక రకాల వృక్షాలు, జంతువులకు, పర్యావరణానికి నిలయంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ కంచ భూములను స్వాధీనం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానం దౌర్జన్య పూరితంగా ఉందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. పండుగ సెలవులు, రాత్రుల్లో పెద్ద ఎత్తున చెట్లను ధ్వంసం చేసే పద్ధతి కుట్ర పూరితమైందన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు, విద్యార్థి సంఘాలు నిరసన తెలుపుతుంటే వారిని దౌర్జన్యంగా ఈడ్చి పడేసి వారిపై లాఠీచార్జ్, అరెస్టులు చేసి అక్రమ కేసులు బనాయించడం నిరంకుశత్వానికి నిదర్శనమని అన్నారు. తక్షణమే హెచ్‌సీయూ భూములు స్వాధీనం చేసుకోవాలనే ఆలోచనను మానుకోవాలని హితవు పలికారు.

◆ హైదరాబాద్ పర్యావరణ సమతుల్యత రక్షించడానికి ప్రభుత్వం, పౌర సంఘాలు, రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలన్నారు. ఇది రాజకీయ కుట్రలకు అవకాశంగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర ఆదాయం కోసమని భూముల్ని కంపెనీలకు అప్పగించారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గోల చేసి అధికారంలో ఉన్నప్పుడు ఇదే పాలసీని ఇంకా తీవ్రంగా అనుసరిస్తారని విమర్శించారు. విద్యార్థులు, పౌర సమాజం, విద్యార్థి సంఘాలు ఐక్యంగా బలమైన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలి

చిక్కడపల్లి: దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని వడ్డెర సంఘం లక్ష్య సాధన రాష్ట్ర అధ్యక్షుడు జెరిపేటి సత్యనారాయణరాజు, వడ్డె సంఘం తెలంగాణ (గన్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలో మంగళవారం సాయంత్రం వారు మాట్లాడుతూ... 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లోనూ ఆమోదించాలన్నారు. ఈ మేరకు ఈనెల 2వ తేదీన ఢిల్లీలో నిర్వహిస్తున్న పోరు గర్జనకు పెద్ద ఎత్తున వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు ఢిల్లీ చేరుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారుడు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, నాయకులు మక్కాలి వెంకటేష్, వల్లపు లక్ష్మీనారాయణ, శివరాత్రి అంజయ్య, వల్లపు గణేష్, అనంతరావు, మోహన్‌కుమార్, శాంతకుమార్, వెంకటకృష్ణ, బాలరాజు, బాలకృష్ణ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

హైడ్రా నిద్రపోతోందా..?

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్



కవాడిగూడ: కొన్ని కొద్ది రోజులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కంచె గచ్చిబౌలి 400 ఎకరాలు కబ్జాకు గురవుతుంటే చెరువులు కాపాడుతానని ప్రతిజ్ఞ భూనిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఏమీ చేస్తున్నారని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ ప్రశ్నించారు. మంగళవారం దోమలగూడలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 400 ఎకరాలలో అడవితో పాటు పికాక్ లేక్, బఫెలో లేక్, క్రేన్ లేక్‌ల పేరుతో మూడు చెరువులు ఉన్నాయని అంటే ఈ 400 ఎకరాలు బఫర్ జోన్‌లోకి వస్తాయన్నారు. అంగులం స్థలం కూడా బఫర్ జోన్‌లో ఉంటే వదలమని చెప్పే రంగనాథ్ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ భూములపై ప్రభుత్వం బేషాజాలకు పోకుండా తక్షణమే హెచ్‌సీయూ విద్యార్థి సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలతో సమావేశమై ఒక నిర్ణయానికి రావాలని సూచించారు. హెచ్‌సీయూ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతామని మొండిపట్టు పడితే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మద్యం తాగి నడిపి.. పోలీసులకు చిక్కి..!



నింబోలిఅడ్డలో ట్యాంకర్ డ్రైవర్‌కు డీడీ పరీక్షలు చేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

కాచిగూడ: మద్యం సేవించి వాటర్ ట్యాంకర్‌ను నిర్లక్ష్యంగా నడుపుతున్న ట్యాంకర్ డ్రైవర్‌ను ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నింబోలిఅడ్డ ప్రాంతంలో ప్రతీక్ సోన్ కాంబ్లే వాటర్ ట్యాంకర్‌ను నడుపుతున్నాడు. నింబోలిఅడ్డలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయగా డ్రైవర్ ప్రతీక్ సోన్‌కు ఆల్కహాల్ 205గా నమోదు అయ్యింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రమాద భరితంగా నిర్లక్ష్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఆయన సూచించారు.

హెచ్‌సీయూలో ఆందోళనల వెనుక అదృశ్య శక్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ విద్యార్థుల ఆందోళన వెనుక అదృశ్య శక్తులు ఉన్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 400 ఎకరాల విషయంలో బీఆర్‌ఎస్, బీజేపీ విద్యార్థులకు తప్పుడు సంకేతాలు ఇస్తున్నాయని, హెచ్‌సీయూ భూములు అంగుళం కూడా ప్రభుత్వానికి అవసరం లేదన్నారు. తెలంగాణ యువతకు విద్య ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సీఎం రేవంత్ రెడ్డి ఆరాటమన్నారు. ఈ విషయమై తెలంగాణ విద్యార్థులు, మేధావులు ఆలోచించాలని కోరారు.

చలివేంద్ర ప్రారంభం

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని చల్లని తాగునీటి ఏర్పాట్లు చేశామని మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్‌కు వచ్చే రైతులు, వినియోగదారులు, కార్మికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

సీతారాముల శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



డీడీకాలనీ అహోబిలం మఠంలో శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: అంబర్‌పేటలో ప్రతిష్టాత్మకంగా ఈనెల 6న చేపట్టే సీతారాముల శోభాయాత్రను విజయవంతం చేయాలని శ్రీరామ నవమి ఉత్సవ సమితి సభ్యుడు డాక్టర్ ఎన్.గౌతంరావు కోరారు. మంగళవారం డీడీకాలనీ అహోబిలం మఠంలో ఆలయ ప్రతినిధులతో కలిసి ఆయన శోభాయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ.. అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి రాంకోటి హనుమాన్ వ్యాయామశాల వరకు శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ శ్రీనివాసులు, కార్పొరేటర్ ఉమారాణి, నాయకులు అజయ్‌కుమార్, శ్యాంరాజ్, కన్నె రమేష్‌యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, చుక్కా జగన్, కెంచె చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రైస్తవ ప్రచారకుడి మృతిపై విచారణ జరిపించాలి

వడ్లమూరి కృష్ణ స్వరూప్

కాచిగూడ: క్రైస్తవ ప్రచారకుడు ప్రవీణ్ పగడాల మృతిపై జ్యూడీషియల్ విచారణ జరిపించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమహేంద్రవరంలో ప్రవీణ్ పగడాల డెడ్‌బాడీ మార్చి 24వ తేదీన అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారని అన్నారు. పోస్టుమార్టం కూడా సక్రమంగా నిర్వహించలేదన్నారు. ఇది యాక్సిడెంట్ కాదని ముమ్మాటికీ ముందస్తు ప్రణాళికతో ఉద్దేశపూర్వకంగా చేసిన హత్య అని ఆయన ఆరోపించారు. ప్రవీణ్ పగడాలను విజయవాడలో కిడ్నాప్ చేసి అత్యంత కిరాతంగా చంపి రాజమహేంద్రవరంలో రోడ్డ పక్కనే హంతకులు పడేశారని ఆయన పేర్కొన్నారు. ఈ హత్య వెనుక మతోన్మాద శక్తులు, కేంద్ర మంత్రులు, ఏపీకి చెందిన కొంతమంది ఎంపీల హస్తం ఉన్నట్లు అనుమానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గోలి నరేష్, అల్లం సురేష్, సంకు శ్రీనివాసులు, చిప్పరి సుబ్బారావు, మద్దెల ప్రవీణ్ కుమార్, పి.సుచంద్రరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్

బీసీ మహాధర్నాను విజయవంతం చేయాలి



ఢిల్లీలో జరిగే బీసీ మహాధర్నాకు తరలివెళ్తున్న బీసీ సంఘాల నేతలు

ముషీరాబాద్: తెలంగాణలో ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లోనూ ఆమోదించాలనే డిమాండ్‌తో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ మహాధర్నాను నిర్వహించనున్నారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్ కోరారు. మంగళవారం ముషీరాబాద్ నుంచి పెద్ద ఎత్తున బీసీ కుల సంఘాల నాయకులతో కలసి ఢిల్లీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ... బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ సారథ్యంలో నిర్వహిస్తున్న మహాధర్నాకు నగరం నుంచి పెద్ద ఎత్తున బీసీలు తరలివెళ్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీ బిల్లును ఆమోదదించాలని డిమాండ్ చేశారు. త్వరలో నిర్వహించనున్న జనగణనతో పాటు బీసీ కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మహిళా కమిటీ అధ్యక్షురాలు కళావతి, నాయకులు సాయి, రాజేష్, ప్రణీత్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఢిల్లీ తరలిన బీసీ నేతలు

కాచిగూడ: పార్లమెంట్‌లో 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాలని ఈనెల 2వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న బీసీల మహాధర్నాలో పాల్గొనడానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, లాల్ కృష్ణ నేతృత్వంలో బీసీలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఢిల్లీలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, తదితరులతో కలిసి మహాధర్నా ఏర్పాట్లను సమీక్షించినట్లు గుజ్జ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు రఘుపతి, ప్రకాష్ గౌడ్, శంకర్, శ్రీహరి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎక్కడ లేని కుల వ్యవస్థ మన దేశంలో ఉంది'



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా కుల వ్యవస్థ మన దేశంలోనే ఉందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో పురోభివృద్ధి సాధించినప్పటికీ సాటి మనిషిని మనిషిగా చూడలేని దుర్మార్గమైన స్థితి నేటికీ కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ... కులం, మతం , ప్రాంతం లింగ బేధం లాంటి సామాజిక రుగ్మతలు మన దేశంలో ప్రజలను కార్మికవర్గాన్ని పట్టిపీడిస్తోందని అన్నారు. దీంతో కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేసి దోపిడీ వర్గాలు తమ ప్రయోజనాలను కాపాడుకుంటున్నాయని విమర్శించారు. ఏప్రిల్ 6 నుంచి 14 వరకు సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాలన్నీ భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు ఎస్‌వీ రమ, వీఎస్ రావు, పురపాటి రమేష్, యాటల సోమన్న, పి.సుధాకర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఆమోదింపజేయాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులదే..



గుంజ శ్రీనివాస్

కాచిగూడ: విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో పాస్ చేసిన రెండు బీసీ బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదింప చేయాల్సిన బాధ్యత రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లదేనని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యద గుంజ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నారాయణగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదం కాకుండా కేంద్రమంత్రులు తెలంగాణకు వస్తే బీసీలు తరిమికొడతారని హెచ్చరించారు. బీసీలకు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక న్యాయం, ఇతర రాష్ట్రాల్లో మరొక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. అగ్రవర్ణాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ ఉద్యమం తరహాలో మరో బీసీ ఉద్యమం వస్తుందని ఆయన హెచ్చరించారు. తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లు చేర్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని ఆయన కోరారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వగా, ముస్లిం రిజర్వేషన్ల సాకుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్వంద్వ విధానాలు అవలంభిస్తోందన్నారు. బీసీ బిల్లును ఆమోదించడంతో పాటు దేశ వ్యాప్తంగా జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవం



జాతీయ పతాకావిష్కరణ దినోత్సవ సభలో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

ముషీరాబాద్: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్, స్మారక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యానగర్‌లో 104వ జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవ మహాసభ మంగళవారం ఘనంగా జరిగింది. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు జగదాంబ పింగళి వెంకయ్య స్మారక సంస్థ చైర్‌పర్సన్ రామారావు ఈ కార్యక్రమానికి అధ్యక్షతన జరిగింది. విద్యార్థులు దేశభక్తి గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్, టీపీసీసీ సెక్రటరీ కేశవ్, బీజేపీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ మెంబర్ రోయ్యూరి శేషసాయి, లయన్స్ క్లబ్ సభ్యులు మిలియన్ బాబురావు పాల్గొన్నారు.

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ధనుంజయ నాయుడు

హిమాయత్‌నగర్: ఈ నెలలో జరగనున్న మహనీయుల జయంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. సమితి రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శులు బొడ్డుపల్లి కృష్ణ, చింతకింది కుమారస్వామితో కలిసి మంగళవారం ఆయన మాట్లాడారు. ఈనెల 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి, 14న అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అందుకు అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు కార్యాచరణ చేపట్టాలని కోరారు. దేశం కోసం, తమ జాతి కోసం తమ మేధస్సును అంకితం చేసిన ఆ మహనీయుల స్ఫూర్తిని నేటి తరం యువతకు తెలియజేయాలన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలి

బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు సూచించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్



చిక్కడపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ముందుండాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం సాయంత్రం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించబోయే పార్టీ ప్లీనరీ సదస్సుపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్లీనరీని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్, రాంనగర్, కవాడిగూడ, ముషీరాబాద్, బోలక్‌పూర్, అడిక్‌మెట్ డివిజన్ల పార్టీ అధ్యక్షులు ఎం.రాకేష్‌కుమార్, శంకర్ ముదిరాజ్, వల్లాల శ్యామ్‌యాదవ్, వై.శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు ముఠానరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ముచ్చకుర్తి ప్రభాకర్, దామోదర్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది..

హెచ్‌సీయూకు సంబంధించిన 400 ఎకరాల భూమిని ఆ విశ్వవిద్యాలయానికి అప్పగించాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీకి చెందిన భూమిని ఎలాగైనా చేజిక్కించుకోవాలనే కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ఆ విధంగా భూములు అమ్మి సొమ్ము చేసుకుందామని చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి ప్రభుత్వం ఈ విధంగా చర్యలకు ఉపక్రమించడం అన్యాయమని అన్నారు. శత్రువులపై యుద్ధానికి వెళ్లినట్లు ప్రభుత్వం బుల్డోజర్ల సహాయంతో దండెత్తడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.